# నా భర్తే — నా గురువు

శ్రీమతి జి. వి. లక్ష్మి

అమ్మా నాన్నకు ఒక్కతెనే కుమార్తెను కనుక చాలగారాబంగా చూస్తూయుండేవారు. నేను ఏది కోరితే అది ఆక్షణం ఎదుటఉండేది. అలాజరుగుతూండగా నాకేది అవుసరమో తెలియకుండా పోయింది. మానాన్న ఇంగ్లీషుభాష చదువుకోకపోయినా తెలుగుమాత్రం తెలియవలసినదానికన్నా ఎక్కువతెలియడంవల్ల లాభంకన్నా నష్టమే ఎక్కువయింది. ఊళ్ళో ఎక్కడ పోట్లాటవచ్చినా, రూలు తెలియనివాళ్ళకు తెలియచెప్పి మరీదాన్ని బలపరచేవాడు. ఆ తరవాత అవసరమైతే తాను కూడ సమర్థుడనని నిలచేవాడు. మొత్తంమీద మా నాన్న ఎంతచెప్పితే మా ఊళ్లోఅంత.

మా ఇంటిప్రక్క గుమాస్తాగారి కుమార్తెను చదివిస్తూఉండేరోజుల్లో మానాన్న లెక్చర్లు అంత, ఇంత కాదు. ఆడపిల్లకు చదువేంటి. గుమాస్తావట్టివెధవ... తన భార్య ఎంతచెప్పితే అంత. భార్యమాటలువిని ఆడపిల్లను చదివిస్తూన్నాడు. అని యీ విధంగా పాపము గుమస్తాగారిని వీధిలో రాగిచెట్టుక్రింద పడుకొని వర్ణిస్తూండేవాడు. ఆ రోజుల్లో నాకూడా చదువుకోవాలని ఉండేది. మానాన్న నడగడానికి ధైర్యంచాలక అమ్మతో చెప్పించాను. నాకు యీ కోరిక కలగటానికి కారణం గుమాస్తా గారికూతు రేనని, మానాన్న విశ్వాసం. అడిగిందినేను. తిట్టింది పాపమూ అమ్మాయిని. చూడండి మానాన్న ప్రయోజకత్వం.

అలారోజులు గడచినకొద్దీ నాకుకూడ చదువంటే తప్పుగాతోచింది. ఆఖరి కిలా అనుకొని తృప్తిపడే దాన్ని. "నాకేంఖర్మం. ప్రొద్దున్నపోయి, సాయంత్రానికి రావాలి, పాడుబడి. కూలివాళ్ళుకూడా ఇలాగే పోతరు." అని, ఆ చదువువిషయం మరచాను. తండ్రికి తగ్గకుమార్తెననిపించుకున్నాను.

ఒకరోజు ఎందుకో మానాన్నపిలచి ఇలా అన్నాడు. 'ఏదన్నా నేర్చుకో అమ్మా ఊరకేఉండి ఏంచేస్తావు.' మానాన్న ఆ మాత్రం త్యాగంచేయ గలిగినందుకు చాలసంతోషించి, హార్మోనియం నేర్చుకొంటానని చెప్పాను. ఆ రోజుమొదలుకొని, హార్మోనియం అతిశ్రద్ధగా నేర్చుకొన్నాను. దానితో లేసులు, ఎంబ్రాయిడింగ్, మొదలైనవి నేర్చుకొంటూ ఉన్నాను. ఆ రోజుల్లో ఎవర్నిచూచినా లెక్కలేనట్లు కనుపించేవారు. అసలు మా ఇంటిప్రక్క అమ్మాయినిచూస్తే అసహ్యమేసేది.

ఇలాంటప్పుడు నాకు పెళ్ళిసంబంధాలు రాసాగాయి. ఎందరోవచ్చి నన్నుచూచి, అన్నీ బాగానే ఉన్నాయి. ఏం చదువుకుంది అనేవారు. మానాన్న ఒక చిన్ననవ్వుతో ప్రారంభించేవాడు. హార్మోనియం నేర్చుకుంది. బాగాపాడుతుంది. కుట్టుపనులన్నీ నేర్చుకొంది. ఇంకేంగావాలి - అనేపోజులో కూర్చునేవాడు, వారడిగింది మినహా, అన్నీ చెప్పడం చూచి, మెల్లిగా జారుకొనేవారు పెళ్ళిపెద్దలు. ఇలా కొన్నిసంవత్సరాలు నన్నుచూడటంతో సరిపోయాయి. అప్పటికి మానాన్న తనతప్పు ఒప్పుకోకపోగా, నన్ను, నా జాతకాన్నిగూర్చి తిడుతుండేవాడు.

మానాన్నకుతోడు మరొకమృగం నాకు మామ అయ్యే యోగంపట్టింది. కాలం, కర్మం కలసి వచ్చాయి. ఎలాగో మానాన్న బరువుతీరింది.

కాపరానికొచ్చినతర్వాత, అసలుజాతకం బయట పడింది. పాపము మావారుచదువుకొని డాక్టరయి ఇంటి

కొచ్చేసరికి మా మామగారు చేసినపనికి ఇప్పుడు ఆయనపడేబాధ చూస్తుంటే నా కెంతో భయంగా ఉండేది. పాపము ఇంటికివచ్చేసరికి "ఏమండోయ్ సాయంత్రం చాకలివస్తాడు, ఇప్పుడే బట్టలు పద్దు వ్రాయండి. మళ్లామరచి బయటకు వెళతారేమో!" అన్న మాటలు ఆయనచెవినిపడేవి. దానితో ఆయన జీవితాన్నిగూర్చి ఆలోచిస్తూ కూర్చునేవారు. కొన్నాళ్ళవరకు నాకు ఆయనబాధ ఏమిటో అర్థమయ్యేదికాదు. ఒకసారి ఇలాఅన్నారు. లక్ష్మీ! నన్నుగూర్చి నీ అభిప్రాయమేంటి! నాకేమి అర్థంకాక నవ్వసాగాను. ఆ నవ్వుకు ఆయనకు కోపము, విరక్తికూడకలిగింది. దానితో ఒకఅరగంట గ్రుక్కమింగకుండా చెప్పడం మొదలుపెట్టారిలా; నేను పుట్టడం, చావడంకూడా ఒకటేనట. నావల్లదేశానికి ఉపయోగంలేకపోగా, అపకారమేనట. నా కారణంగా తనజీవితంకూడ నాశనమయిందట. నాలుగు గోడలమధ్య పదార్థంలాగున్నానట. నాలాంటి స్త్రీ ఉండటం, స్త్రీజాతికేకళంకమట. ఇలా ఎన్నో నాకర్థంకానిభాషలో లెక్ఖలేవు.

ఆక్షణంలో నాబాధ వ్రాయలేను. కాని నాలో చీకటి అంతరించి ఒకవిధమైన వెలుతురు ప్రవేశించినట్లయింది. నాజీవితం కండ్లకు కట్టినట్లు కనుపిస్తూంది. వెంటనే మావారి పాదాలమీదపడి క్షమాపణవేడుకొన్నాను. కాసేపు మానాన్న స్వార్థాన్నిగూర్చి తిట్టుకొన్నాను. చదువులేని ప్రతిస్త్రీకూడ ఇంతే కదా! తల్లిదండ్రుల మూఢవిశ్వాసాలకు గురిఅయితే ఆస్త్రీ ఇలాచీకటికొట్లో మసిఅయిపోవలసిందేగా! అబ్బఇలాంటి తండ్రులు, నిజంగా తండ్రులా! వాళ్ళ కుటుంబగౌరవంకొఱకు ఎంతమందిబిడ్డల్ని అన్యాయం చేసికొంటున్నారు! నాభర్తలాంటిభర్త అందరికీ లభించునా! యీ విషయంలో నాభర్తమీదప్రేమ రెట్టింపయింది. ఆయన తిట్టినవన్నీ నాకు దీవెనలయ్యాయి. ఆరోజు మొదలుకొని నాభర్తనాకు గురువయ్యారు. ఇది నాజాతక ప్రభావం. "నాసోదరీమణులందరికీ చెప్పబోయేదేమంటే నన్ను ఆదర్శంగా తీసికొని చదువే ముఖ్యంగాభావించి స్త్రీజాతికి గౌరవము, అభివృద్ధికలిగేటట్ల చేయమని" నాప్రార్థన.

పాత్రుడుగారి
బాలసంజీవిని (Regd)
పిల్లల లివర్ అండ్ స్ప్లీన్ వ్యాధులను నివారించును.
డాక్టరు పిల్లా పాపయ్య పాత్రుడు అండ్ బ్రదర్స్,
11, దక్షిణ మాడవీధి, మైలాపూరు, మదరాసు.
కుంభకోణము బ్రాంచి: 1. సారంగపాణి కోవిల, తూర్పువీధి.
తిరుచినాపల్లి బ్రాంచి: 15 పుగళియపిళ్లెవీధి, తెప్పకుళం. P. O.
అన్ని మందుల షాపులలోను దొరకును.